క్లుప్తంగా

ముగిసిన వేసవి కరాటే శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల సాయి పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరుగుతున్న వేసవి కరాటే శిక్షణ మంగళవారం ముగిసింది. ఈనెల 1వ తేదీ నుంచి బాపట్ల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ట్రూ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీ కరాటే శిక్షణ నిర్వహించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పర్వతారోహకుడు షేక్ హిమాంస పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రైనర్ వీ బ్రహ్మానాయుడు, ప్రిన్సిపాల్ సర్దార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నేడు

చీరాల: భారతీయ జనతా పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం పట్టణంలోని ఎస్టే రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకటరమణారావు మంగళవారం తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్నందున పార్టీ పిలుపు మేరకు నెల రోజులు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ హాజరుకానున్నట్లు తెలిపారు. అలానే రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, క్యాంపెయినింగ్ కమిటీ క్లస్టర్ ఇన్‌చార్జులు మాగంటి సుధాకర్ యాదవ్, పి.రవిశంకర్, జిల్లా ఇన్‌చార్జి ఎ.శ్రీరామ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రీ స్కూల్‌లో అన్ని వసతులు



ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, కార్యకర్తలు

పర్చూరు (చినగంజాం): చిన్నారులను ప్రీ స్కూల్‌కు తల్లులు సంసిద్ధులు చేయాలని మండలంలోని బోడవాడ అంగన్‌వాడీ కార్యకర్తలు పిలుపు నిచ్చారు. మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రీ స్కూల్ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. చిన్నారులకు ప్రీ ప్రైమరీ-1, 2లపై ఇంగ్లిషులో బోధన జరుగుతుందని వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు కే రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, సునీత, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి లబ్ధిదారుల ఎంపిక



కారంచేడులో వీఓఏలతో మాట్లాడుతున్న అధికారులు

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉందని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం, వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆమె వీఓఏలతో మాట్లాడారు. 2023-24 సంవత్సరాలలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు అనుబంధ సంస్థల సహకారంతోను అర్హుల జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధి కోసం ప్రతి ఒక్క కుటుంబానికి కనీసం రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కూడా బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాయికృష్ణ, ఫీల్డు ఆఫీసర్ సౌజన్య, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఖాశీం, ఏపీఎం మధుసూదనరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గర్నెపూడి సుధారాణి, అన్ని గ్రామాల వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర ఫలాలు పూర్తిస్థాయిలో అందలేదు

చీరాల రూరల్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి నేటికి 75 పూర్తయినప్పటికి నేటికి అత్యధిక భాగం ప్రజలకు స్వాతంత్య్ర ఫలాలు అందడం లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసి ఎంప్లాయూస్ యూనియన్ కార్యాలయంలో భారత్ బచావో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 16న బాపట్ల అంబేడ్కర్ భవన్ వద్ద జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, మేడ వెంకట్రావు, మాచర్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల సాగు.. లాభాలు బాగు



కొనిదెనలో సాగులో ఉన్న ఆకుకూరలు



అద్దంకిలో అమ్మకాలు సాగిస్తున్న రైతులు

- ఆకుకూరల సాగుతో లాభాల్లో రైతులు
- అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరులో 140 ఎకరాల్లో సాగు
- ఒక కట్ట రూ.10 నుంచి రూ.15 వరకు అమ్మకం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

బల్లికురవ: వేసవిలో కూరగాయలే కాదు.. ఆకు కూరలు కూడా మండిపోతున్నాయి. కాదు కాదు చేతికి చిక్కకుండా పోతున్నాయి. వేసవిలో ఎండల కారణంగా కూరగాయలు, ఆకుకూరల సాగు తక్కువగా ఉంటుంది. కేవలం బోర్ల ఆధారంగా, ఇతరత్రా నీటి వసతి ఉన్నచోట మాత్రమే వీటిని సాగు చేస్తున్నారు. దీంతో కూరగాయలు, ఆకుకూరలు ఉత్పత్తి తగ్గడంతో ధరలు అమాంతం పెరిగాయి. ప్రతి రోజు ఆహారంలో ఆకుకూరలు తినాలన్న వైద్యుల సూచనల మేరకు ఆకు కూరలకు రోజురోజుకు గిరాకీ పెరుగుతోంది. గిరాకీ తగ్గట్టు ప్రభుత్వం హెచ్‌వీడీఎస్ పథకంలో బోర్లకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వటంతో రెండేళ్లుగా సీజన్‌ల వారగా 365 రోజులు ఆకు కూరలు పండిస్తూ రైతులు లాభాలు అర్జిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలోని కొణిదెన, అద్దంకి మండలంలోని సింగరకొండపాలెం, చినకొత్తపల్లి, గోవాడ, వెంకటాపురం, కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు, సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి మిన్నెకల్లు, తంగేడులో 140 ఎకరాల్లో వివిధ ఆకుకూరల సాగులో ఉన్నాయి. పెరుగు తోటకూర, పాలకూర, చుక్కకూర, పొన్నగంటి కూర, గోంగూర, కొత్తిమీర, పుదీనా సాగు చేపట్టారు. ఒక్కో రైతు 20 సెంట్ల నుంచి అరెకరా వరకు సీజన్‌ల వారీగా సాగు చేపడుతున్నారు.

మార్టూరు, అద్దంకి మార్కెట్‌ల్లో అమ్మకాలు..

మార్టూరు, అద్దంకి మార్కెట్‌లలో అమ్మకాలతో పాటు కొందరు ప్రధాన గ్రామాల్లో సైకిళ్లు, బైకులతో, కావిళ్లతో అమ్మకాలు చేపడుతున్నారు. దళారుల బెడదలేకుండా రైతులే మార్టూరు, అద్దంకి మార్కెట్‌లలో గిరాకీ సైజును బట్టి కట్ట రూ.5 నుంచి 10 వరకు ఆకు కూరలు, పుదీనా, కొత్తిమీర కట్ట రూ. 20 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన పట్టణాలకు హోల్‌సేల్‌గాను ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో వేసవిలో కొందరు రైతులు లాభాలు సాధిస్తున్నారు.

20 సెంట్లలో ఆకుకూరలు..



20 సెంట్లలో బోరు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సీజన్‌ల వారీగా అన్నిరకాల కూరలు సాగుచేస్తున్నాను. ప్రతి రోజూ ఆకుకూరలు కోసి కట్టలు కట్టి మార్టూరు మార్కెట్ తీసుకువెళ్లి విక్రయిస్తున్నా. వచ్చిన లాభంతో కుటుంబపోషణ జరుగుతోంది.

– చలపాటి బ్రహ్మయ్య, కొణిదెన

ఆకుకూరలే జీవనాధారం..

రెండు దశాబ్దాలుగా 20 సెంట్లలో వివిధ రకాల ఆకు కూరలు సాగుతో బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి గ్రామాల్లో కావిడి వేసుకుని తీసుకెళ్లి అమ్మి జీవిస్తున్నా చేతికి అందివచ్చిన కుమారుడు చనిపోయాడు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ ఆకు కూరల సాగు అమ్మకంతోనే నేను, నాభార్య జీవిస్తున్నాం.

– వల్లంశెట్టి వెంకటస్వామి, కొణిదెన



బల్లికురవలో ఆకు కూరలు అమ్ముతున్న రైతు వెంకటస్వామి

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆమంచి

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కోమట్ల శివరాంరెడ్డి, సీనియర్ నాయకులు పాకనాటి వెంకటరామయ్య, బొప్పన రామాంజనేయులు, సింగంశెట్టి రాముడు, ఏకాంబరం పూర్ణచంద్రరావు, బొప్పన శ్రీనివాసరావు, నక్కల శేషయ్య, అనంత శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రఖ్యాత మైక్రోసాఫ్ట్ కంపెనీ నిర్వహించిన సర్టిఫైడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరచి 253 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణరావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ప్రఖ్యాత మైక్రోసాఫ్ట్ కంపెనీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యంతో సర్టిఫికేషన్ కోర్సులను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులను కళాశాలయాజ మాన్యం అభినందించింది.

బైకుల చోరీ నిందితుల అరెస్టు

బల్లికురవ: పనుల నిమిత్తం బల్లికురవ ప్రాంతానికి వచ్చిన ఇరువురి బైకులు చోరీకి గురికాగా బాధితుల ఫిర్యాదుతో కేసుల నమోదుతో ఛేదించినట్లు ఎస్సై వీ. వేమన మంగళవారం తెలిపారు. బాపట్ల జిల్లా చీరాల మండలం కీర్తివారిపాలెం గ్రామానికి చెందిన నర్రా నాగరాజు ఈర్లగంగమ్మ ఆలయం వద్దకు రాగా హెచ్‌ఎఫ్ డీలక్స్ బైకు చోరీకి గురైనట్లు, పల్నాడు జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన నారపు శెట్టి మహేష్ బైకు కొణిదెనలో చోరీకి గురైందని దర్యాప్తుతో బైకులను, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివరించారు. కొత్తవ్యక్తులు గ్రామాల్లో తిరుగుతుంటే తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో ఇదో సువర్ణాధ్యాయం



వృద్ధుడితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి): రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ సీపీ పరిపాలన ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని పుట్టావారిపాలెంలో రెండో రోజు కార్యక్రమాన్ని అధికారులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ ఆయా కుటుంబాల్లోని చిన్నారులు, పెద్దలు, వృద్ధులను పలకరిస్తూ ముందుకుసాగారు. వారికి అందిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం ద్వారా కలిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రతిపక్షం ఎన్ని అవాకులు చవాకులు పేలినా వారి మాటలు నమ్మేవారు లేరన్నారు. ఎవరు ప్రజలకు మేలు చేస్తున్నారో వారికే తెలుసుకుని, ఎవరో చెబితే తెలుసుకునే స్థాయిలో లేరని కృష్ణచైతన్య చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా పదవీ చేపట్టిన తరువాత హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. చెప్పింది చేసే అలవాటు చంద్రబాబుకు లేదన్నారు. పైగా ప్రజలకు మేలు జరుగుతుంటే ఏదో ముంచుకుపోయినట్లు, ఏదో నష్టం జరిగినట్లు భ్రమ పడడటం ఆయన నైజమని విమర్శించారు. ప్రజలు ఏది మంచో తెలుసుకుని మరలా ఇదే ప్రభుత్వాన్ని వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి నేతలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీలోని వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

సంస్కృతాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

అద్దంకి రూరల్: సంస్కృత భాషను, సంప్రదాయాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంస్కృత భారతి ఆంధ్రప్రాంత అధ్యక్షుడు జన్నాభట్ల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం అద్దంకిలో రామసుశీల నిలయంలో పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్కృతాన్ని సంరక్షించాలన్న ధ్యేయంగా సంస్కృత భారతి సంస్థ పనిచేస్తుందన్నారు. భాషా ప్రాచుర్యానికి ప్రపంచ వ్యాప్తంగా 56 దేశాల్లో 4500 కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డీవీయం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర దత్తు, చుండూరి మురళీ సుధాకర రావు, లక్కరాజు చంద్రశేఖర్, నర్రా శ్రీలక్ష్మి, మహమ్మద్ రఫీ, అద్దంకి లెవీ ప్రసాద్, తాళ్లూరి వేణుగోపాల్, పాలపర్తి జ్యోతిష్మతి, కెవీ పోలిరెడ్డి, చప్పిడిరయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పచ్చదనంగా ఉంచడమే లక్ష్యం

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



ఆటోను నడిపి ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా అద్దంకిని తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తడి, పొడి చెత్తల సేకరణకు కావల్సిన ఐదు ఈ-ఆటోలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ అద్దంకిలో తడి, పొడి చెత్తలను సేకరించేందుకు ఈ-ఆటోలు ఉపయోగపడతాయ్నారు. ఆటోలను వినియోగించుకుని వీధుల వెంట చెత్త వేయరాదన్నారు. పరిసర పరిశుభ్రతతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. అనంతరం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని, నిర్మాణంలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు కాంట్రాక్టు ద్వారా ఇళ్లు పూర్తిచేసేందుకు బ్యాంకు అకౌంట్‌లను ప్రారంభించారు. స్థానిక కాలవకట్టపై నివాసం ఉంటున్న వారికి జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని ఖాళీచేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మీ, కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్‌లు, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక ఓ వరం



బల్లికురవలో కిట్లు పంపిణీ చేస్తున్న పేరయ్య, ఎంపీపీ



కుంకలమర్రులో కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సంతమాగులూరు (అద్దంకి): జగనన్న విద్యా కానుక ఒక వరమని ఎంఈవో కోటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు పద్మావతి హాజరయ్యారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారంచేడు: జగనన్న విద్యా కానుక ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కుంకలమర్రు మొయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన జేవీకే కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో పాఠశాలల పునఃప్రారంభ సమయానికి పాఠ్యపుస్తకాలు కూడా అందుబాటులో ఉండేవి కాదన్నారు. పాఠశాలలు తెరిచిన తరువాత రెండు, మూడు నెలల వరకు పుస్తకాలు కూడా లేక విద్యార్థులు అవస్థలు పడేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని, ప్రతి పాఠశాలలోను ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి అవసరమైన జేవీకే కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సువర్ణ బాబు పాల్గొన్నారు.

అద్దంకి: విద్యా కానుక విద్యార్థులకు జగన్ మామ ఇచ్చిన వరమని 20వ వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు అన్నారు. ఆయన వార్డులోని పాఠశాలలో మంగళవారం విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కాలనీలో వలస కూలీలు, దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న ప్రజలు ఎక్కువగా జీవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమం హెచ్‌ఎం కోట అంజమ్మ అధ్యర్యంలో నిర్వహించారు.



అద్దంకిలో కానుక కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

బల్లికురవ: నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందిచేందుకు విద్యా వ్యవస్థలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి మార్పు చేస్తున్నారని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. మంగళవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, పీయంసీ చైర్మన్ యస్ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌యం కె.హనుమంతరావు, ఎంఈవో బీ.రాఘవవయ్య, తదితరులు పాల్గొన్నారు. వల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ మందా మోహన్‌రావు, కొండ్రు చిన్నా, పాఠశాల హెచ్‌ఎం కె. శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యా కానుక కిట్లు పంపిణీచే శారు.

చినగంజాం: జగనన్న విద్యా కానుక కిట్లు ద్వారా నాణ్యమైన మెటీరియల్‌ను విద్యార్థులకు ప్రభుత్వం అందించిందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మూలగానివారిపాలెం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల నందు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు పద్మావతి



మూలగానివారిపాలెంలో కిట్లు అందజేస్తున్న బ్రహ్మానందరెడ్డి

ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

- ప్రత్యర్థులకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సవాల్
- తప్పుడు వార్తలు రాసిన పత్రికలపై పరువు నష్టం దావా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పర్చూరు పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌పై పలు దినపత్రికల్లో వచ్చిన అసత్య కథనాలపై నియోజక వర్గ పార్టీ శ్రేణులు తీవ్రంగా స్పందించారు. ఆధారాలు లేని అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. విచారణకు ఎక్కడికి రమ్మన్నా వస్తామని, అవినీతి జరిగిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని వారు సవాల్ విసిరారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పర్చూరు పార్టీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు మాట్లాడుతూ వార్తలు రాసేటప్పుడు వివరాలు అడిగి తెలుసుకొని రాయడం మంచి పద్ధతన్నారు. ఎలాపడితే అలా వార్తలు రాసి ఎదుటి వారిపై బురద చల్లటం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేయొవద్దని హితవు పలికారు. దగ్గుబాడు సర్పంచ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆమంచిపై సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి ఫిర్యాదు చేయడంపై ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకర్ మాట్లాడుతూ ఠాగూర్‌పై రౌడీ షీట్, పోక్సో కేసులు ఉన్నాయని, అతడు ఆరోపిస్తే వివరాలు అడగకుండా పత్రికలో గుడ్డిగా ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. అవినీతికి అడ్డుకట్ట వేసినందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దేవరపల్లి ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్ అన్నారు. నియోజకవర్గంలో ఉన్న సుమారు 30 వేల దొంగ ఓట్లు ఓటమి భయంతో తీసువేస్తున్నారని ఠాగూర్‌తో ప్రత్యర్థులు ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు బలరాం విమర్శించారు. దళితులకు అండగా ఉంటున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లంక శివ, ముప్పాళ్ల రాఘవ, మల్లా శ్రీనివాసరావు, దండా చౌదరి, నూర్ అహ్మద్, కుక్కపల్లి నాగేశ్వరరావు, షేక్ కాలేషా, తిరుమలేశ్వరరావు, కొల్లా శ్రీహరి, గాదె సురేష్, తులసి రాజా, ఆకుల హేమంత్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

చీరాల రూరల్: అథ్లెటిక్స్ క్రీడాకారుడు రాయిని ప్రదీప్ నాయుడుకు క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందచేశారు. మంగళవారం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణలు మాట్లాడుతూ ఏడాది అక్టోబర్‌లో జార్కండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు ప్రదీప్ నాయుడు ఎంపికయ్యారని చెప్పారు. అయితే క్రీడల్లో పాల్గొనేందుకు ముందుగా హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో శిక్షణ తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు ప్రోత్సాహకంగా చిరుసాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బల్లికురవ: పొలాల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు మంగళవారం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వీ. వేమన తెలిపారు. మండలంలోని కోటావారిపాలెం గ్రామ సమీపంలో జూదరుల నుంచి రూ.78,460 స్వాధీనం చేసుకున్నామని, వారిని కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

ప్రజలకు మజ్జిగ పంపిణీ

చీరాల అర్బన్: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు జిల్లా దళిత బహుజన పార్టీ అధ్యక్షులు షేక్ జిలాని ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడగాలులు వీస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.